# నీ యుద్ధం నువ్వే చేసుకో

ఈ గదిలో, నా గదిలో ఇక రెండు మూడు నెలల తర్వాత, లేదా ఇంకో రెండు మూడేళ్ళ తర్వాత కూర్చుని కథ రాసుకుంటున్నాను. కూలీలు సమ్మె చెయ్యడం, వాళ్ళ ఆకలియాత్ర, వాళ్ళ మనస్సులలో ఆలోచనలూ ఇవన్నీ కలిపి కథ రాయాలని నా ఉద్దేశం. కడుపులు కాలుతూ ఉంటే, కాళ్ళు మాడుతూ ఉంటే వాళ్లు తమ గురించీ, తమ భవిష్యత్తు గురించీ ఏమని ఆలోచిస్తారనే సంగతి ఆలోచిస్తున్నాను. ఇంతట్లో ఎవరో తలుపు తట్టిన చప్పుడయింది.

ఆ తలుపు తట్టింది అదృష్టం కాదని నాకు బాగా తెలుసును. అదృష్టం, లేదా అవకాశం ఒకమారే తలుపు తడుతుందని ఇంగ్లీషు సామెత.లోగడ ఒకసారి అదృష్టం నా తలుపు తట్టడం, అప్పుడు నేను ఇంట్లో లేకపోవడం జరిగింది. ఏదో పనిమీద, పోనీ ఏదో పని వెదుక్కునే పనిమీద ఎక్కడికో పోయాను. అంచేత ఈసారి తలుపు తట్టింది అదృష్టం కాదని స్పష్టం. అయితే మరెవరు? బహుశా మా పెత్తల్లి కొడుకు భద్రంగాడయి ఉండాలి. భద్రంగాడు గొప్ప రచయిత. వాడేది రాయలేదు. రాయాలనే కోరిక కూడా వాడికి లేదు. అయినప్పటికీ, ఊఁహూఁ, అంచేతనే వాడొక గొప్ప రచయిత. వాడు కాకపోతే మరెవడు? ఎవడు తలుపు కొడతాడు ఈ సమయంలో? తప్పకుండా సాయిబుగారి గుమస్తా అయివుండాలి. మాసిపోయిన పంచా, చిరిగిపోయిన చొక్కా, విషాదపూరితమైన మొగమూ వేసుకొని నెలకోమాటు నా గదికి వచ్చి సాయిబుగారికి నే నివ్వవలసిన ఎనిమిది రూపాయిలూ ఈ నెలైనా జమ కట్టకపోతే కేసు పడెయ్యవలసి ఉంటుందని నాకు జ్ఞాపకం చేస్తూ ఉంటాడు. సాయిబుగారి తరపున ఈ పెద్దమనిషి ఇళ్ళ అద్దెలు వసూలు చేస్తూ ఉంటాడు. ఎప్పుడో నేను సాయిబుగారి వరసకొట్లలో ఒకదాంట్లో ఉన్నప్పుడు నెల్లాళ్ళ అద్దె బాకీ మిగిలిపోయిందట. నాకు జ్ఞాపకమే లేదు. అస లాకొట్లలో ఎప్పుడైనా ఉండేవాడినా అనిపిస్తుంది. అయినా ప్రతి నెలా ఈయన రావడమూ. నన్ను గట్టిగా మందలిస్తూ ఎనిమిది రూపాయలు ఇమ్మనడమూ, లేకపోతే సాయిబుగారు నన్ను కోర్టు కీడ్చి, శిక్ష వేయించేస్తాడని హెచ్చరించడమూ మామూలు.

సాయిబుగారి గుమాస్తాని నేను బాగా ఎరుగుదును. వందసార్లు నన్ను కలుసుకున్నవాడిని ఎందుకు బాగా ఎరగను? ఒక విధంగా మేము స్నేహితుల మయామని

చెప్పాలి. స్థూలదృష్టికి మేము శత్రువుల్లాగ కనిపించినా అతనితో నాకు విరోధం లేదు. మీ పేరేమిటని అతణ్ణి నే నెప్పుడూ అడగలేదు గాని మిగతా సంగతులన్నీ అతనే నాకు చెప్పాడు. భార్యా, నలుగురు పిల్లలూ ఆయనకి. నలుగురూ ఆడపిల్లలే. ఆఖరి పిల్లకి ఎప్పుడూ జబ్బే. ఏడుపుతో ఇల్లెగరకొడుతూ ఉంటుందట.

మొదట్లో నా కీయనమీద కొంచెం అసహ్యం ఉండేది. సాయిబు దగ్గర పని చేస్తున్నా డెందుకా అని: కాని తన సంసారపు చిక్కులూ. పిల్లకి జబ్బూ, జీతపురాళ్లు చాలకపోవడం ఇవన్నీ తెలుసుకున్నాక అతనంటే జాలి కలిగింది. ఏదో ఒక పని ఇష్టం లేకపోయినా ఎందు కతను చేసితీరాలో బోధపడింది. ఏడుపుమొగం వేసుకొని నాదగ్గరికి వస్తూ ఉంటాడు. అందులోనే కొంత ఆగ్రహాన్ని ప్రదర్శిస్తూ, "చూడండీ, సూరిబాబుగారూ! అదుగో, ఇదిగో అని మీరు ఆలస్యం చేస్తే లాభంలేదు. ఏమైనాసరే ఆ యెనిమిది రూపాయలూ చెల్లించకపోతే మా సాయిబుగారు ఒప్పుకోరు" అంటాడు. నే నంటాను గదా, "దయచెయ్యండి. ఈ చాపమీద కూర్చోండి. సిగరెట్టు కాల్చరూ? మీ అమ్మాయి నింపాదిగా ఉందా?" అని. నిట్టూర్పు విడుస్తూ చాపమీద కూర్చుని గుమాస్తా సిగరెట్టు అంటిస్తాడు. "ఆఖరిసారి ఖండితంగా అడుగుతున్నాను" అని ప్రారంభిస్తాడు. "సరే. ఖండితంగానే అడగండి. నే నెవ్వరికీ ఒక్క దమ్మిడీకూడా బాకీ లేను. మా పెత్తల్లి కొడుకు భద్రంగాడి దగ్గర నే నొకమారు పావలా వాడు కున్నాను. అందుకోసం వాడు నన్ను కోర్టు కీడుస్తానని ఎప్పుడూ బెదరించడు" అంటాను నేను. తర్వాత మేము ఒక అరగంటసేపు ఆ మాటా ఈ మాటా చెప్పు కుంటూ గడుపుతాము. గుమాస్తా తన ఇబ్బందులు ఏకరువు పెడతాడు. తన పరిస్థితు లేవీ బాగులేవంటాడు. నా పరిస్థితులు కూడా ఏమీ బాగు లేవంటాను కథ రాయాలను కోవడం, బాగా రాయలేకపోవడం, సరియైన ప్రారంభం కుదరకపోవడం ఇటు వంటివి.

తలుపు తట్టిన చప్పుడువల్ల నా ఆలోచనలకి అంతరాయం కలిగింది. తలుపు తియ్యాలని లేచాను. మా పెత్తల్లిగారి భద్రంగాడయితే వాణ్ని చీవాట్లుపెడతాను. గుమా స్తాగా రయితే మర్యాదగా పలకరించి, మీ అమ్మాయికి వొంట్లో ఎలా వుందని అడుగుతాను.

అయితే వీళ్ళిద్దర్లో ఎవరూ రాలేదు. ఆ వచ్చినవాడు రమారమి యాభై ఏళ్ళ మనిషి. పొట్టిగా, బొద్దుగా ఉన్నాడు మొగంలో తెలివితేటలు లేవుగాని ఏదో గొప్ప ఊహవల్ల తాత్కాలికంగా ఆ మొగంలోని కొంత వెలుగు వచ్చినట్టుంది. అతని ఎడం చేతిలో ఒక తోలుసంచీ ఉంది. అందులో ఏవో అమూల్యమైన దస్తావేజు లున్నా

యనడానికి సందేహం లేదు. ఈ వచ్చిన మనిషిని ఇదివర కెప్పుడూ నేను చూడలేదు. కాబట్టి మంచి కథ రాయడానికి సరిపోయే సరు కేమాత్రమైనా ఇతని జీవితంనుంచి గ్రహించ వచ్చునని ఆశ కలిగింది.

"చింతపిక్కల సూరిబాబుగారూ!" అన్నాడతను. అన్నా డేమిటి, అరిచాడు! ఆ అరుపునుబట్టి ప్రపంచంలో ఎక్కడో ఒక గొప్ప సంఘటన, ఏదో చరిత్రాత్మకమైన ఉపద్రవం సంభవించి ఉండాలని నే ననుకున్నాను.

"ఔను, నన్నే చింతపిక్కల సూర్యనారాయణ అంటా" రన్నాను.

ఎప్పుడో ఎక్కడో నేను చేసి మరిచిపోయిన చిల్లర నేరానికి ఉరిశిక్ష విధిస్తున్నట్టుగా అతడు 'అయ్యా! చింతపిక్కల సూరిబాబుగారూ! తమర్ని తక్షణం సైన్యంలో చేర్చడానికి అఖిలాంధ్ర శాంతి సంఘం తరపున ఇక్కడికి వచ్చాను. మా సంఘం అంతర్జాతీయ ప్రజాస్వామ్య రక్షణ సభవారి ఆంధ్ర శాఖ. ఫాసిజం, నాజీజం, కమ్యూనిజం, అనార్కిజం మొదలగు దుష్టశక్తులను నిర్మూలించడమే మా ఆశయం. కాబట్టి మీరు తక్షణమే నా కారులో బయలుదేరి సైనిక ప్రధాన కార్యాలయానికి రావాలి. అక్కడ మీకు సరికొత్త మిలిటరీ యూనిఫారమూ, ఒక తుపాకి ఇవ్వబడును. వెంటనే నాతో రండి" అని గుక్క తిప్పుకోకుండా ఆయన అన్నాడు.

అతని ఉపన్యాసం బాగానే ఉందిగాని నాలో కదలిక పుట్టించ లేకపోయింది. కొంపలు తగులబడుతున్నంత తొందరగా అతడు మాట్లాడాడు. నేనుమాత్రం తాపీగా సిగరెట్టు వెలిగించి "యుద్ధం వచ్చిందా?" అని ప్రశ్నించాను.

"అయ్యో! మీ కింకా తెలియదూ?" అన్నా డాయన, నా తెలివితక్కువకి విచారిస్తూ! "నేటి ఉదయం ఆరు గంటలకి యుద్ధం ప్రకటించబడినట్లు పేపర్లలో మీరు చూడలేదూ?" అని అడిగేడు.

"అంత పెందరాళే యుద్ధం ప్రకటించుకుంటారా ఎవరేనా? సరిగ్గా ఎవరూ నిద్ర మంచాలమీంచి లేవనైనా లేవరే! అయినా ఆ ప్రకటనని ఎవరు చేశారు?" అని నే నడిగేను.

ఈ ప్రశ్నకి పొట్టి ఆయన కొంచెం చిరాకు తెచ్చుకున్నాడు. మొగం చిట్లించుకొని "పూర్తి వివరాలు పేపర్లో ఉన్నాయి" అన్నాడు.

"నేను పేపర్లు చదవను. రచయితని నేను. పేపర్లు చదివితే నా శైలి పాడయిపోతుంది. ఐనా ఆ యుద్ధ ప్రకటనని ఎవరు రచించారు?" అని ప్రశ్నించాను.

పొట్టి మనిషికి పూర్తిగా కోపం వచ్చింది. "మీ పేరు సూర్యనారాయణ వురపు సూరిబాబు అవునా, కాదా?" అన్నాడు.

"ఔను."

"అయితే నాతో వచ్చితీరాలి మీరు."

"క్షమించాలి. నేను కార్మికుల ఆకలియాత్ర గురించి కథ రాసుకుంటున్నాను. మీ యుద్ధంలో చేరలేను నేను. ఇవాళ ఈ కథ పూర్తిచెయ్యాలి. తర్వాతనైనా మీతో రాలేను."

"అంతర్జాతీయ ప్రజాస్వామ్య రక్షణ సభ పేరిట అఖిలాంధ్ర శాంతి సంఘం పేరిట శాపిస్తున్నాను. వస్తావా? రావా?"

"రాను. నీ దిక్కున్న చోట చెప్పుకో" అని తలుపు బిడాయించాను.

గదిలో కూర్చుని మళ్ళీ కథారచనకి ఉపక్రమించాను. కాని యుద్ధం ఒకటి వచ్చి పడిందంటే అది ఎవరికీ ఏమీ తోచనియ్యదు. అందరినీ అది అకస్మాత్తుగా మార్చేస్తుంది. యుద్ధం అంటే ఇష్టంలేని నాబోటివాళ్ళని సహా!

కాగితంమీదకి కలం వెళ్ళలేదు. అటూ ఇటూ పచారు చేస్తూ యుద్ధం గురించి మరిచి పోవడానికి ప్రయత్నిస్తున్నాను.

అరగంట అయిందో లేదో మళ్ళీ తలుపు చప్పుడు. ఈసారి ఒక సైనికోద్యోగి ఎదురుగా నిలబడ్డాడు. వయస్సుకి కుర్రాడే. అప్పుడే కాలేజీ చదువు పూర్తిచేసిన వాడి లాగ ఉన్నాడు.

"చింతగింజల సూర్యనారాయణగారూ!"

"చింతపిక్కల" అని సవరణ చేసి అతణ్ని లోపలికి దయచెయ్యమన్నాను. నాతో కరస్పర్శ చేసి లోపలికి వచ్చాడు.

"నాపేరు చందనం" అన్నా డతను.

"చందనంగారికి వందనం. ఆ పెట్టెమీద కూర్చోగలరూ?"

చందనంగారు నా ఆతిథ్యం స్వీకరించి జేబులోంచి ఒక సిగరెట్ కేస్ తీసి, తెరచి పట్టుకున్నాడు. అతని సిగరెట్టును అంగీకరించాను నేను. ఇద్దరం సిగరెట్లు కాలుస్తున్నాము.

"రావుబహద్దర్ వెంకటరత్నంగారు ఉదయం మీ దగ్గరికి వచ్చారని తెలిసింది. వారి రిపోర్టునుబట్టి చూస్తే.... మరి.... వారి కారులో మీరు ప్రధాన కార్యాలయానికి రాదలచుకోలేదని కనబడుతోంది. మీ కెలాగయినా నచ్చజెప్పి మిమ్మల్ని సైన్యంలో చేర్చవలసిందిగా మా సైన్యోద్యోగి నన్ను పంపించాడు. ఇది వెనకటి యుద్ధాలవంటిది

కాదు. మనం స్వతంత్రంగా ఇందులో పాల్గొంటున్నాం. నాగరికతా రక్షణకి జరుగుతున్న ఈ యుద్ధంలో మీవంటివారంతా చేరక తప్ప దనుకుంటాను.''

చందనంగారితో సంభాషణ ముచ్చటగానే ఉంది. అయితే నాగరికతను రక్షించడాని కొక యుద్ధం అవసర మయిందంటే నాకు నవ్వొచ్చింది. నాగరికతకి ప్రమాదం రానుండడం వల్లనే అతనివంటి వాళ్ళు పని కట్టుకొని నా దగ్గరికి వచ్చారా. అనిపించింది.

''అయినా ఏ నాగరికత?'' అన్నాను.

''మన నాగరికత, భారతీయ సంస్కృతి, ప్రపంచం ఇప్పుడు రెండు శిబిరాలుగా విడిపోయింది. మనం ధర్మపక్షం వహించి పోరాడుతున్నాం.''

''నాకు ఏపక్షం తరఫునా పోరాడాలని లేదు. కొన్నాళ్ళు నాగరికత సెలవు పుచ్చుకుంటేనే బాగుంటుందని నా ఉద్దేశం.''

''ఇది వేళాకోళాలకి సమయం కాదు. మీ సోదరులతోబాటు మీరుకూడా రణరంగంలోకి దూకవలసిన సమయం ఆసన్నమయింది. లేకపోతే రాక్షసశక్తులు విజృంభించి చిరకాల సంప్రదాయానుగతమైన మానవ నాగరికతను భస్మీపటలం చేస్తాయి.''

''నిజంగానా?''

''తప్పకుండా। ప్రజాస్వామ్య సంప్రదాయాలను కాపాడడానికి ఈ యుద్ధంలో చేరాలి. అవసరమైతే ప్రాణత్యాగం చెయ్యాలి.''

''మీరు చేస్తారా?''

''స్వాతంత్ర్యంకోసం తప్పకుండా ప్రాణత్యాగం చేస్తాను.''

దేనికోసమయినా ప్రాణత్యాగం చెయ్యడం నా కిష్టంలేదని నే నన్నాను. చాలామంది ఉరిపోసుకునీ, రైలుకింద పడిపోయీ చచ్చిపోతూ ఉంటారు గాని అందులో లాలిత్య మేమీ లేదన్నాను. యుద్ధంలో కొన్ని నవీన పద్ధతులద్వారా చచ్చిపోవడానికి అవకాశాలు లభిస్తాయిగాని అసలు చచ్చిపోవడమే నా కిష్టం లేదని అతనికి స్పష్టం చేశాను. కథా రచయితగా వీలయినంతకాలం సజీవంగా మిగలడమే నా ఉద్దేశమని చెప్పాను.

''బాగా ఆలోచించుకోండి. నిర్బంధ శాసనం వెలువడకముందే సేనలో చేరితే మంచిది'' అంటూ అతను వెళ్ళిపోయాడు.

ఆరోజుకి మరి నా కథ సాగింది కాదు, యుద్ధం వచ్చి నన్ను రాయనిచ్చింది కాదు. ఏమీ తోచక వీథిలోకి వచ్చాను. ప్రజల్లోకూడా పెద్ద మార్పు వచ్చినట్లు కనపడింది. కాని ఒకటిమాత్రం నిశ్చయం చేసుకున్నాను. మళ్ళీ ఎవరేనా వచ్చి నన్ను యుద్ధంలో చేరమంటే వాడి తలకాయ బద్దలుకొడదా మనుకున్నాను.

సాయంత్రం ఇంటికి రాగానే నా గదిలో మా పెత్తల్లిగారి భద్రంగా డున్నాడు. కపిలవాయి రామనాథశాస్త్రి పాడిన 'బలే మంచి చౌక బేరమూ' అనే గ్రామఫోను రికార్డు వింటూ సిగరెట్టు కాలుస్తున్నాడు. వాడికి సంగీత మంటే చెడ్డ సరదా. ముఖ్యంగా కపిలవాయిని మించిన గాయకుడు ప్రపంచంలో లేడని వాడి అభిప్రాయం.

“యుద్ధంమీద నీ అభిప్రాయ మేమి”టని అడిగాను.

“నన్నడక్కు. నాకు తెలియదు.”

“కొయ్యకు. నిజం చెప్పు. నీకు మైనారిటీ తీరింది. మైనారిటి తీరినవాళ్ళంతా సైన్యంలో చేరవచ్చు.”

“పటాలా లంటే నా కసహ్యం.”

“నిర్బంధ శాసనం వస్తే ఏం చేస్తావు?”

“నేను రానంటాను. వరసలో నిలబడలేను. కవాతు చెయ్యలేను.”

“లేకపోతే జైల్లో వేస్తారు.”

“వేసుకోమను.”

“నాగరికతను కాపాడాలని నీకు లేదూ?”

“లేదు.”

భద్రంగాడు నాకు నచ్చాడు. ఇవాళ ఇద్దరు పెద్దమనుష్యులు నన్ను సైన్యంలో చేర్చడానికి ప్రయత్నించారనీ, ఇద్దర్నీ అంపకం పెట్టాననీ చెప్పాను.

“మంచి పని చేశావు. ఈ యుద్ధం నువ్వు ప్రారంభించలేదు కదూ! ఎవళ్ళు ప్రారంభించారో వాళ్ళనే చేసుకోమను యుద్ధం.”

వారం రోజులు గడిచాయి, ఖాకీ దుస్తులు ధరించిన ఒక అమ్మాయి మా యింటికి వచ్చి “సూర్యనారాయణగారూ! మీరు కథలు రాస్తారని మాకు తెలిసింది. ఈ యుద్ధంలో ఎలాగయినా మీ సహకారం పొందదలచుకున్నాము. యుద్ధ ప్రచార శాఖలో మీరు చేరి సేనలలో పనిచేస్తున్న యువతీ యువకుల అసమాన సేవని కొనియాడుతూ మీరు కథలూ వ్యాసాలూ రాయాలి. ఏమంటారు?” అని అడిగింది.

"అటువంటివి రాయడం నాకు చేతకా" దన్నాను నేను.

"ఇందులో కష్టమేమీ లేదు. కావలసిన భోగట్టా అంతా మేమే ఇస్తాము. మీరు దాన్ని చక్కని భాషలో పేర్లుమాత్రం మార్చి రాస్తే చాలును."

"కథలు ఎలాగ రాయాలో నాకెవరూ చెప్పనక్కరలేదు" అన్నాను.

"ఆలోచించుకొండి. నెలకి మూడు వందలు జీతం, బుష్ కోటు వేసుకో వచ్చును. మిలిటరీ ఛాయాలోనే ఉంటుంది ఉద్యోగం."

నా జన్మలో నేను నెలకి మూడు వందలు ఆర్జించ గలగడం కష్టమే. బుష్ కోటు వేస్తే నేను బాగుంటాను కూడా. అయినా ఆ ఉద్యోగం నా కక్కరలేదని ఆవిడని పంపించివేశాను.

రెండు నెలలు గడిచాయి. ఒక ఉదయం మా భద్రంగాడు న్యూస్ పేపరుతో ప్రత్యక్షమయాడు. పద్దెనిమిదేళ్ళ వయస్సు దాటినవా రంతా నిర్బంధ సైనిక సేవ చెయ్యాలని ఉత్తరువు జరిగింది. కొన్నాళ్ళనించీ మనం పోరాడుతున్న పక్షం అప జయాలు పొందుతోంది. వార్తాపత్రికలలో శీర్షికల సైజులు నానాటికీ హెచ్చవుతు న్నాయి. జాతీయ ఋణపత్రాల అమ్మకం హెచ్చుతోంది. మీటింగులూ, ప్రార్థనలూ హెచ్చవుతున్నాయి.

సిగరెట్టు వెలిగించి వార్తాపత్రికని దీక్షగా చూస్తున్నాను.

"ఏమంటా" వన్నాడు భద్రంగాడు.

"వెళ్ళను గాక వెళ్ళను" అన్నాను.

అయిదు రోజులు పోయాక నాకో ఉత్తరం వచ్చింది; మర్నాటి ఉదయం ఎనిమిది గంటలకి స్థానిక సైన్యాల ప్రధాన కార్యాలయంలో హాజరు కావలసిందని; మర్నాటి ఉదయం ఎనిమిది గంటలకి నా గదిలో నేను కూర్చొని కథ రాయడానికి ప్రయత్నిస్తున్నాను. పదకొండు గంటలైనా కథ పెగల్లేదు.

ఇక ఈ రోజుకి కథ సంగతి ఆలోచించకూడ దనుకుంటున్న సరికి రావు బహద్దరు వెంకటరత్నంగారూ, మరో నలుగురు పెద్దమనుష్యులూ నా గదిలోకి తోసు కొచ్చారు. వారి వెనకాతల ఇద్దరు మిలిటరీ పోలీసులు నిలుచున్నారు. వీథిలో ఖరీ దైన రెండు మోటారు కార్లున్నాయి.

"వీడే చింతపిక్కల సూరిబాబు!" అని నన్ను చూపిస్తూ రావుబహద్దరుగారు "ఉదయం ఎనిమిదికి ఎందుకు రాలేదూ?" అన్నారు.

"రాలేదు" అన్నాను నేను.

"ఉత్తరం నెంబరు (అ)-247 నీకు అందిందా?"

"అందింది."

"చదువుకున్నావా?"

"చదువుకున్నాను."

"అయితే ఆఫీసు కెందుకు రాలేదు?"

"కథ రాసుకుంటున్నాను."

"తిన్నగా జవాబు చెప్పు. ఒంట్లో సుస్తీగా వుందా?"

"లేదు. ప్రస్తుతం నేను చాలా ఆరోగ్యంగా ఉన్నాను.

"అయితే, సైన్యంలో చేరనందుకు నిన్ను అరెస్టుచేస్తున్నాను."

ఈ మాట లనడం అతను పూర్తిచేశాడో లేవో నేను రావుబహద్దరును ఒక మొత్తు మొత్తి కింద పడేశాను. డొక్కలో అతణ్ని తంతూ ఉండగా మిగిలినవాళ్ల నన్ను లాగేశారు. వాళ్ళనికూడా తన్నడానికి ప్రయత్నించాను. పోలీసులు నాకు కాళ్ళూ చేతులూ ఆడనివ్వడంలేదు. ఇదంతా రెండు మూడు నెలలో రెండు మూడేళ్ళో గడచి నా గదిలో కథ రాసుకొనేటప్పుడు. ఇంకొకరు నా గదిలోకి ఎందుకు రావాలి? నా చుట్టూ నేనొక చిన్న నాగరికతని సృష్టించుకున్నాను. వీళ్ళెవరు నన్ను నిర్భంధించడానికి? కాని అందరూ కలిసి నన్ను వీథిలోకి లాక్కుపోతున్నారు. "మీ యుద్ధాన్ని మీతో కలిపి తగలెయ్యా!" అని అరుస్తున్నాను నేను. "ఎందరిని చంపినా ఈ ముసలివాళ్ళకి తృప్తి లేదు. నన్ను చంపక మీ యుద్ధం మీరే చేసుకొండర్రా" అని కేకలు వేస్తున్నాను. "వెంకటరత్నంగారు చచ్చిపోకపోతే అదృష్టవంతుడివే. జైలుతో సరిపోతుంది! చచ్చిపోతే మాత్రం నిన్ను గుండు వేసి కాల్చేస్తాం" అని ఎవరో అంటున్నారు. వాళ్ళు నన్ను ఈడ్చుకు వెళ్లతున్నంతసేపూ ఆ మాటలే నా చెవులో గింగురుమంటున్నాయి.

మూలం: William Saroyan

ముద్రణ: కిన్నెర 1949 ఏప్రిల్ ?